


## సబ్జక్టు - అబ్జక్టు - ప్రిడికేట్

ఆ మూడు రాత్రిళ్ల కార్యకలాపం లోకంపోకడకు భిన్నంలేకుండా జరిగి పోయింది. నాల్గోనాడురాత్రి యిటుపైని భార్యా తనపట్ల ఎట్లా నడుచుకోవాలని తన అభిమతమో అది ముందుగా తెలియజేయడం ఎంతో ముఖ్యం అనే అభిప్రాయంతో యిట్లా ప్రారంభించాడు.

భర్త: మన పెళ్లిచూపులకుముందు నీ వెవర్తెవో, నే నెవర్నో మనకు తెలియదు. నీ యింట్లో నీ వెట్లా పెరిగావో నాకు, నా యింట్లో నే నెలా పెరిగానో నీకుకూడా తెలియదు. నీలో కోపరస మేవుందో, హాస్యరసమేవుందో మరేరసం జాస్తీగా వుందో నాకు తెలియదు గాని, నీరసంమాత్రం లేదని యిప్పటికి తెలిసింది. అందుకు నేను చాలా సంతోషిస్తున్నాను. నీ మతం ఎట్లాంటిదో గ్రహించేముందు, నామతం చెపుతాను. తర్వాత నీదికూడా చెప్పు. రెండూ సరిగా వుంటే ఏ బాధలేదు. లేకపోతే మనం Adjust అవడానికి కొంచెం ప్రయత్నించాలసివుంటుంది.

భార్య: ఈ సోదంతా ఎందుకు? అసలు ఏమిటో చెప్పండి.

భర్త: నా మతం ఏమిటో వినకుండానే సోదిమతం అనేస్తున్నావే!

భార్య: మరి కాకపోతే ఎందుకండి యీ లెక్చరంతా? మీ మతం ఏమిటో అంతా వ్రాసుకొని నా ముందు చదువుతారా? అది నేనంతా విని నామతం మీముందు ఏకరుపెట్టాలా? మీ మతాలను నేను, నామతాలను మీరు తెలుసుకుని యిప్పుడు ఏ పరీక్షకు కట్టాలి? ఆ పరీక్షలో తప్పిపోతే మళ్లీ చదవాలా? మరే పరీక్ష వద్దు. ప్యాసువద్దు. ఇక చాలు.

భర్త: ఏమిటి చాలు? ఈ సబ్జక్టు యింతటితో చాలించమంటావా?

భార్య: అసలు యిదొక సబ్జక్టు అయితేగా?

భర్త: సబ్జక్టే కాదంటావు? అయితే మరేమిటి?

భార్య: మీ అబ్జక్టు.

భర్త: పోనీ యిది నా Object అని అయినా గ్రహించావు గదా! నా కంతే కావాలి. నా అబ్జక్టు ఏమిటో నీవు గ్రహించుకుంటూ సంచరిస్తే అంతే చాలులే.

భార్య: మీ మతోపన్యాసంలో సబ్జక్టు ఆబ్జక్టేగాని ప్రిడికెట్ వుండదా ఏమిటి?

భర్త: ఎందు కుండదు? బోలెడు. ఇక యీ క్షణంనుండి ఆ క్రియాభాగమే గదూ! కాస్త జరుగుతావా మరి!!

కాంచనపల్లి వెంకటరంగారావు

* * *

## దురాశ దుఃఖము చేటు

అయ్యార్, సయ్యార్ యిద్దరూ ఆ పట్టణంలో గొప్ప ఆటగాళ్ళు. ముఖ్యంగా ఫుట్‌బాల్ ఛాంపియన్స్. ఏ వొక్క రోజు ఆటఆడక పోయినా, ఆ రోజు వాళ్ళ కాళ్ళనిండా తేళ్ళూ, జెర్రులు పాకినట్లుండేది.

ఒక రోజున దురదృష్ట వశాత్తు రోజూ బంతిని మైదానంలోకి తెచ్చే ఫ్యాన్ ఆరోజు రాలేదు. ఇక చూడండి వాళ్ళ తమాషా! ఫ్యాన్ బంతి తేలేదని యిద్దరికీ పట్టలేని దుఃఖము వచ్చింది అంతలో అయ్యార్‌కి ఎదురుగా ఒక మైలురాయి కనబడింది. ఆ ఉద్రేకంతో వెళ్ళి మైలురాయిని ఒక తన్ను తన్నాడు. గట్టిగా లేకపోవటంచేత మొదటితన్నుకే వూడి పడింది ఆరాయి. ఆశ్చర్యం! రాయి పడ్డచోట అయ్యార్‌కి ఒక సంచీ కనబడింది. విప్పి చూశాడు. అన్నీ బంగారు నాణాలే! తన అదృష్టం పండిందనుకున్నాడు. ఆ రోజు సయ్యార్‌కి విందుగూడా చేశాడు. కాని యిదిచూసి సయ్యార్ ఓర్వలేక పోయాడు.

ఆ మర్నాడే సయ్యార్ ఒక్కడూ మైదానంలోకి వెళ్ళాడు. అయ్యార్‌కి పట్టిన అదృష్టం తనకీ పట్టాలనుకొన్నాడు. ఆ ప్రక్కనే రోడ్డుమీద వున్న మైలురాయిని బలం కొద్దీ తన్నాడు రాయి పగలకపోగా, కాలికి బలమైన దెబ్బ తగిలి, నెత్తురు కారింది.

అప్పటికిగాని తెలియలేదు సయ్యార్‌కి, దురాశ దుఃఖము చేటు అని.

కె. యస్. గిరీశ్వర రావు.